జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక






చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - వర్కింగ్ ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 21-12-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 199 పేజీలు: 4 వెల : రూ.7


# సూపర్.. పోలీస్



* నగరంలో సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం
* ప్రారంభోత్సవానికి హాజరైన హీరోయిన్ శ్రీలీల
* అభిమానులతో కిటకిటలాడిన జీటీ రోడ్డు
* జనాన్ని అదుపు చేసిన పోలీసులు
* జడివానలో పోలీసుల బందోబస్తు
* డీఎస్పీ, సీఐలకు ప్రశంసలు వెల్లువ

**శ్రీకాకుళం క్రైం, డిసెంబర్ 20(వార్త):** శ్రీకాకుళం నగరంలోని జీటీ రోడ్డులో శుక్రవారం సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభమైంది. హీరోయిన్ శ్రీలీలతో పాటు ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. హీరోయిన్‌ను చూసేందుకు జడివానలోనూ అభిమానులు పెద్దఎత్తున వచ్చారు. దీన్ని ముందే గమనించిన పోలీసులు జాగ్రత్త పడ్డారు. జీటీ రోడ్డులో వాహనాల రాకపోకలను నిలువరించారు. ఎక్కడికక్కడ బారికేడ్లు ఏర్పాటు చేశారు. సీఎంఆర్ షాపింగ్ మాల్‌లోకి ప్రజలు ఎగబడకుండా అన్ని చర్యలు చేపట్టారు. డీఎస్పీ సీహెచ్ వివేకానంద, సీఐ ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్ఐలు, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా , ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా, తోపులాటలు జరగకుండా డీఎస్పీ ఒక ప్రణాళిక ప్రకారం



ముందడుగు వేయడంతో ఈ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం అనంతరం హీరోయిన్ శ్రీలీలతో 'డ్రగ్స్ వద్దు బ్రో', 'సంకల్పం' పోస్టర్లు ఆవిష్కరించే కార్యక్రమం నిర్వహించారు. అలాగే మాదకద్రవ్యాలు వాడకం వల్ల జరిగే అనర్థాలపై హీరోయిన్ శ్రీలీలతో యువతకు అవగాహన కల్పించి.. సిక్కోలు పోలీసులు.. శభాష్ అనిపించుకున్నారు.








## డ్రగ్స్ వద్దు బ్రో

* ప్రముఖ సినీ నటి శ్రీ లీల
* డీఎస్పీతో కలిసి పోస్టర్ ఆవిష్కరణ

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ప్రముఖ సినీ నటి శ్రీ లీల కోరారు. శుక్రవారం శ్రీకాకుళంలో జి.టి.రోడ్డులో వస్త్ర దుకాణం ప్రారంభోత్సవ కార్యక్రమానికి శ్రీలీల పాల్గొన్నారు. సీఎంఆర్ షాపింగ్ మాల్ ఆవరణలో మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలు గురించి తెలిపే డ్రగ్స్ వద్దు బ్రో, సంకల్పం పోస్టర్‌లను ఎమ్మెల్యే గొండు శంకర్, శ్రీకాకుళం పట్టణ సబ్ డివిజన్ డీఎస్పీ వివేకానంద్‌తో కలిసి శ్రీలీల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా యువత మత్తు పదార్థాలు వినియోగానికి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మీ యొక్క విలువైన జీవితం సమాజం కోసం, తల్లిదండ్రుల కోసం ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. మత్తుకు బానిసైతే జీవితం చిత్తవుతుందని ప్రతి ఒక్కరు గుర్తించాలని కోరారు. పోలీస్ యంత్రాంగం మాదక ద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మాజీ ముఖ్యమంత్రి జగన్ పుట్టినరోజు వేడుకలకు తరలిరావాలి



**మందస, డిసెంబర్20(వార్త):** మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలకు తరలిరావాలని మూలిపాడు సర్పంచ్ గుసిరి వెంకట రావు పిలుపునిచ్చారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆదివాకం ఉదయం 9.30గంటలకు కాశీబుగ్గలోని ప్రగతి భవన్(వైసీపీ కార్యాలయం) ఆవరణలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జగనన్న పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరుగుతాయన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యు లు, కార్యకర్తలు, నాయకులు, యువకులు, మహిళలు తప్పక హాజరు కావాలని కోరారు.



## డబారిసింగిలో రూ.2.30 కోట్లతో ప్రత్యేక పాఠశాల

**మందస, డిసెంబరు 20(వార్త):** మందస మండలం బొగాబంద పంచాయతీ డబారిసింగి వద్ద ప్రత్యేక గిరిజన పాఠశాల నిర్మాణానికి పీఎం-జన్‌మన్ కింద రూ.2.30 కోట్లతో హాస్టల్ మంజూరైనట్టు జనసేనపార్టీ సమన్వయకర్త డాక్టర్ వేగులాడ దుర్గారావు చెప్పారు. దేశంలో మారుమూల పల్లెల్లో నివసించే గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం అవుతూనే ఉన్నాయని, ఫలితంగా వారి అభివృద్ధి కుంటువడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఈ ప్రాంత పరిస్థితులను అధ్యయనం చేసి పాఠశాల నిర్మాణానికి జిల్లా సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ అధికారికి నివేదిక అందజేశామన్నారు. గిరిజన గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలలు లేక పోవడంతో పిల్లలు చదువుకు దూరమయ్యారని జనసేన నాయకులు హరీష్ కుమార్, శ్రీకాంత్, దిలీప్ కుమార్పాణిగ్రాహి, కోన కృష్ణారావు, దువ్వాడ వంశీకృష్ణచౌదరి, నందిగాం ధర్మారావులతో కలిసి తాను ఉన్నతాధికారులకు నివేదికలు అందజేయడంతో కేంద్ర ప్రభుత్వం మొదటగా రూ.2.30కోట్లతో 60 బెడ్స్ తో హాస్టల్ మంజూరు చేసిందన్నారు. కూటమి ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధి దిశగా పీఎం-జన్‌మన్ పథకాన్ని ప్రధాని మోదీ బిర్సాముండా జయంతి రోజున ప్రారంభించారన్నారు. డబారిసింగ్, కుడుమసాయి, గోపాలసాయి, కుమ్మర కుటియా, కొయిటాసాయి తదితర మారుమూల గిరిజన గ్రామాలలో పాఠశాలలు లేక, విద్యకు దూరంగా ఉంటున్న గిరిజనులకు అక్షరాలు నేర్పించాలనే ఉద్దేశంతో పీఎం జనజాతి ఆదివాసీ న్యాయమహా అభియాన్(పీఎం-జన్‌మన్) పథకం కింద పాఠశాల ఏర్పాటుకు జనసేన చేసిన కృషి చేసిందని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే వసతి గృహానికి నిర్మాణానికి విద్యాశాఖ చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఈ వసతి గృహాన్ని అనుసంధానించి, గిరిజనుల బతుకుల్లో వెలుగులు నింపే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తోందని దుర్గారావు స్పష్టం చేశారు.


## ఏపీ ప్రభుత్వ రిటైర్డ్ పింఛనుదారుల సంఘం కార్యదర్శిగా నారాయణరావు



**మందస, డిసెంబరు 20(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం మందస మండల కార్యదర్శిగా వాయలపల్లి నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మందసలో జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. గుంట కేశవరావు అధ్యక్షతన, గొర్లె సాంబమూర్తి పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో అధ్యక్షునిగా అంపోలు త్రినాథరావు, ఉపాధ్యక్షునిగా మజ్జి బాబురావు, కార్యదర్శిగా వాయలపెల్లి నారాయణరావు, కోశాధికారిగా శిస్టు నవీన్చంద్ర, జాయింట్ కార్యదర్శిగా కొర్ల వాసుదేవరావు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యుటివ్ మెంబర్లుగా దువ్వు రామారావు, కొర్ల పాపారావు, జీపీ మహాపాత్రో, వి.అభిమన్యు, పొందూరు వేణుగోపాలరావు, ఎంవీ రమణ, దువ్వాడ దామోదరం, బి.సరస్వతి ఎన్నికయ్యారు. ప్రత్యేక ఆహ్వానితులుగా గుంట కేశవరావు, కొత్తపల్లి మోహనరావు హాజరయ్యారు. నూతన కార్యవర్గాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగులు అభినందించారు.

## పర్యావరణ సమతుల్యతకు మొక్కలు నాటండి

**మందస, డిసెంబరు 20(వార్త):** పర్యావరణ సమతుల్యతకు ప్రతీ ఒక్క విద్యార్థి విధిగా మొక్కలు నాటాలని కొత్తపల్లి ప్రధానోపాధ్యాయుడు ఎస్.గణేశ్వర రావు కోరారు. స్థానిక కొత్తపల్లి ఉన్నత పాఠశాల పీఎంసీ ఛైర్పర్సన్ కోమటి దమయంతి కుమార్తె కోమటి శ్రీజ జన్మదినం సందర్బంగా పాఠశాలకు మొక్కలు బహుకరించారు. మొక్కలను శ్రీజ చేతులు మీదుగా పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు నాటించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. పర్యావరణ సమతుల్యత కొరకు ప్రతీ ఒక్క విద్యార్థి విధిగా మొక్కలు నాటి, వాటిని పెద్దవి చేయాలన్నారు. కార్యక్రమం లో ఉపాధ్యాయులు జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్ కుమార్, ఎస్.అబ్రహం, పి.రాంబాబు, ఎం.చిత్రసేను, ఎం.దామోదరం, జి.గోపాలకృష్ణ, బి.రమేష్ , విద్యార్థులు పాల్గొన్నారు.



### విప్లవ సాంస్కృతికోద్యమయోధుడు పాణిగ్రాహి

# స్మారక సభకు తరలిరండి

*ఏడు విప్లవ, ప్రజా సంఘాల ఉమ్మడి పిలుపు *ఉద్దానంలో ప్రజా సంఘాల ప్రచారం





**మందస, డిసెంబరు 20(వార్త):** విప్లవ సాంస్కృతికోద్యమ యోధుడు సుబ్బారావు పాణిగ్రాహి అమరత్వానికి 55 పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని విప్లవ, ప్రజా సంఘాల ఉమ్మడి పిలుపునిచ్చాయి. మందస మండలంలో ఉద్దాన గ్రామాలైన గంగువాడ, టి.గంగువాడ, రాంపురం, బేతాళపురం లక్ష్మీపురం, రట్టి, బిడిమి గ్రామాల్లో ప్రజా సంఘాలు ప్రచారం నిర్వహించాయి. 'పాణిగ్రాహి పోరాట జీవితం-వర్తమాన ప్రాసంగికత-ప్రాధాన్యం' అనే అంశంపై ఏడు విప్లవ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10గంటలకు శ్రీకాకుళందరి పెద్దపాడు వానవానిపేటలో పాణిగ్రాహి స్మారక బహిరంగను నిర్వహిస్తున్నట్టు ఏఐకెయంఎస్ జిల్లా నాయకుడు గొంకల బాలకృష్ణ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమ చెప్పారు. ఈ సభకు పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏడు విప్లవ ప్రజా సంఘాల పక్షాన వారు పిలుపునిచ్చారు. ఏఐకెఎంఎస్, ఐఎఫ్టియు, పీవోడబ్ల్యు, అరుణోదయ, పీవైయల్, పీడీఎస్యు, ప్రగతిశీల దళిత వేదిక సంస్థలు ఉమ్మడిగా ఈ సభా నిర్వహణ బాధ్యతను వహిస్తున్నాయని చెప్పారు. మందస మండలం ఉద్దానం గ్రామాల్లో పాణిగ్రాహి వర్థంతి సభను విజయవంతం చేయాలని కోరుతూ నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. విప్లవ స్ఫూర్తితో చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయిన శ్రీకాకుళ సాయుధ గిరిజన రైతాంగ పోరాటంలో సుబ్బారావు పాణిగ్రాహి ఆటా, పాటా, మాటా తూటాలై పేలి విప్లవ పోరాట చరిత్రగా నిలిచిపోయిందన్నారు. పెన్నూ, గన్నూ ఏకం చేసి, విప్లవించిన ధీరుడు పాణిగ్రాహి అని అన్నారు. ప్రజాకవిగా, ప్రజాకళాకారునిగా, విప్లవ సాంస్కృతికోద్యమయోధునిగా వీరోచిత కర్తవ్యంతో పాణిగ్రాహి పోరాటంలో ధ్రువతారగా నిలిచారన్నారు. ఏఐకెఎంఎస్ జిల్లా నాయకుడు గొరకల బాలకృష్ణ, పీవోడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనపల్లి కుసుమతో పాటు ఏఐకెఎంఎస్ నాయకుడు రాపాక మాధవరావు, ఐఎఫ్టియు నాయకుడు బర్ల గోపి, పోతనపల్లి మల్లేశ్వరరావు, పీవోడబ్ల్యు జిల్లా కోశాధికారి బర్ల జానకమ్మ మాట్లాడుతూ శ్రీకాకుళ విప్లవోద్యమం మీద రాజ్యం నిర్బంధాన్ని ప్రయోగించినప్పుడు, తన భుజాన జముకును వేసుకొని రాష్ట్రవ్యాప్తంగా జముకుల కథను ప్రదర్శించి ప్రజల మద్దతును కూడగట్టిన పోరు ధీరుడు పాణిగ్రాహి అని కొనియాడారు. 1969 డిసెంబరు 22న మందస దరి రంగమెటియా కొండల్లో సుబ్బారావు పాణిగ్రాహిని బూటకపు ఎన్‌కౌంటర్‌లో అప్పటి కాంగ్రెస్ నియంత పాలకులు అమానుషంగా కాల్చి చంపారన్నారు. అలాగే నిర్మల, ఉమారావు, రమేష్ చంద్ర, అంకమ్మ, సరస్వతిలు కూడా అదే రోజునే( అమరత్వం చెంది, విప్లవ పోరాట ధ్రువతారలయ్యారని తెలిపారు. పాణిగ్రాహితో సహా ఆరుగురు విప్లవ యోధుల అమరత్వానికి యాభై ఐదేళ్ళు కావస్తున్న సందర్భంగా... స్మారక సభను నిర్వహిస్తున్నామన్నారు. ఈ ప్రచారంలో స్థానిక నాయకులు కొమర వాసు, చిత్త గున్నయ్య, సంతోష్, నారాయణ, కృష్ణారావు, సోమేశ్వరరావు, దమయంతి, జ్యోతిలక్ష్మి, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

* ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రాధాన్యం *రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

**టెక్కలి, డిసెంబర్ 20(వార్త):** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని, ప్రజలు తమ సమస్యలను ప్రజాదర్బార్ దృష్టికి తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. టెక్కలి నియోజక వర్గం కోటబొమ్మాళిలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌కు పెద్ద ఎత్తున ప్రజల నుంచి వినతులు అందాయి. అప్పటికప్పుడు కొన్ని సమస్యలకు మంత్రి అధికారులతో మాట్లాడి వాటికి పరిష్కారం చూపారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని చెప్పారు. అర్హులకు సంక్షేమపథకాలు అందజేస్తామని తెలిపారు. అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తామన్నారు. అనర్హులకు పింఛన్లు తొలగిస్తామన్నారు. రైతులకు మేలు చేసే విధంగా పాలన సంస్కరణల అమలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కింజరాపు హరివర ప్రసాద్, ఎల్.ఎల్.నాయుడు, బగాది శేషు, తదితరులు పాల్గొన్నారు. ప్రజాదర్బార్‌లో ఇటీవల జిల్లా రైస్ మిల్లర్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు బోయిన రమేష్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అలాగే నీటి సంఘాల ఎన్నికలలో గెలుపొందిన చైర్మన్లు, వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు మంత్రిని కలిశారు. అన్నా క్యాంటీన్ నిర్వహణ నిమిత్తం



రూ.10వేలును కోటబొమ్మాళికి చెందిన అల్లు రమేష్ తన కుమార్తె నిత్య శ్రీ జన్మదినం సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుకు అందించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వెటర్నరీ వైద్యుల పోస్టులు భర్తీ చేయాలని మంత్రికి విద్యార్థులు వినతిపత్రం అందజేశారు.

## కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదే

**పలాస, డిసెంబర్ 20(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని శుక్రవారం పలాస టిడిపి నాయకులు మర్యాదపూర్వకం కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేస్తే విజయం మనదేనని అన్నారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీటీపీ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు, నీటి సంఘాల అధ్యక్షుడు జి.నిరంజన్, లొడగల కామేష్ యాదవ్. గురుటి సూర్యనారాయణ, తమ్మినేని గంగారం, గాలికృష్ణారావు, సాసమాను చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



## జిల్లా బిసి సెల్ అధ్యక్షుడిగా మోహనరెడ్డి



**సంతబొమ్మాళి, డిసెంబర్ 20 (వార్త):** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధినేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు భావనపాడు సర్పంచ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షుడుగా బి. మోహన్ రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు రెడ్డిక సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేశారు. నాపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవీ బాధ్యతలను తూచా తప్పకుండా నిర్వహిస్తానని, పార్టీ కోసం ఆహర్నిశలుకృషి చేస్తానని మోహన్‌రెడ్డి తెలిపారు. మాజీ డిప్యూటీ సీఎం, జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధర్మాన కృష్ణదాసు , టెక్కలి నియోజవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పేరాడ తిలక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మోహన్‌రెడ్డి నియామకం పట్ల భావనపాడు ఎంపీటీసీ సభ్యురాలు బి.రాజ్యలక్ష్మి, మాజీ ఎంపీటీసీ సభ్యులు బి. వెంకటరమణ, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోతుమల్లి వెంకన్న, కారాడ చిన్నబాబు , బై ధర్మారావు, బత్తిని పకీరు, తరణి వెంకటరమణ, నీలాపు జంగమయ్య, దున్న సాయి, చీరపు తమ్మయ్య, బి.రాజేంద్ర రెడ్డి, బి.రాజురెడ్డి, వంకదానేసులు హర్షం వ్యక్తం చేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆన్లైన్ లావాదేవీలపై అప్రమత్తం



**హిరమండలం, డిసెంబర్ 20 (వార్త):** ఆన్లైన్‌లో లావాదేవీలు చేసుకునేవారు అప్రమత్తంగా ఉండాలని , లేకుంటే మోసపోయే అవకాశం ఎక్కువగా ఉందని శ్రీకాకుళం జిల్లా వినియోగదారుల జనరల్ సెక్రెటరీ అందవరం వెంకట్ సురేష్ తెలిపారు. శుక్రవారం హిరమండలంలోని అందవరపు వీధిలో వినియోగదారుల వారోత్సవాలు సందర్భంగా ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు, విద్యార్థులు, ప్రజలు చట్టాలపై అవగాహనతో పాటు బాధ్యత కూడా కలిగి ఉండాలని అప్పుడే సమాజంలో వినియోగదారులకు సరైన సేవలు అందుతాయన్నారు. వినియోగదారులు వస్తువులు కొనేటప్పుడు మోసపోతే వినియోగదారుల ఫోరంకు సంప్రదించాలన్నారు.

# కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం




**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 20 (వార్త):** అభివృద్ధి ప్రదాత, విజనరీ లీడర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని కల్లేపల్లి గ్రామస్తులు అన్నారు. నగరంలోని విశాఖ ఏ కాలనీలో ఉన్న ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్ సమక్షంలో కల్లేపల్లి గ్రామస్తులు టిడిపిలో శుక్రవారం చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ వారికి టిడిపి కండువాలను వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం పాలనలో గ్రామాలు పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో కనీసం మౌలిక సదుపాయాలకు నోచుకోక దీనావస్థలో నిలిచిపోయిందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామాల్లో అభివృద్ధి పనులు జోరు అందుకున్నాయని, శంకరన్న హయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చెబుతున్నారని తెలిపారు. వైసిపి ప్రభుత్వంలో కార్యకర్తలకు, నాయకులకు ఎటువంటి గౌరవం లేకుండా పోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో కార్యకర్తలకు గుర్తింపు గౌరవం లభిస్తుందని చెప్పారు. ఎమ్మెల్యే శంకర్ ఆధ్వర్యంలో పనిచేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఏ గ్రామానికి వెళ్ళినా ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి ఆదరణ లభిస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులవుతున్న ప్రజలు స్వతహాగా పార్టీలో వచ్చి చేరడం ఇది శుభ పరిణామం అని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మూకల్ల శీను, మూకల్ల జయానంద్, శీర రమణయ్య, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆశ్రాకు ఎక్సలెన్సీ అవార్డు

**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 20 (వార్త):** వినియోగదారుల హక్కుల పరిరక్షణకు ఆశ్రా అందిస్తున్న సేవలు అభినందనీయమని సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తాన్ అలీ తెలిపారు. బెంగళూరులో ఇటీవల జాతీయస్థాయిలో 6వ జాతీయ సమ్మిట్‌కు జాతీయ అధ్యక్షులు, సుప్రీంకోర్టు అడ్వకేట్ హబీబ్ సుల్తాన్ అలీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన శ్రీకాకుళం ఆశ్రా టీంకు ఎక్సెన్సీ అవార్డును జిల్లా అధ్యక్షులు డా.గంజి ఆర్ ఎజ్రాకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు వారి హక్కులపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడంలో ఆశ్రా బృందం చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఆశ్రా టీం శుక్రవారం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి సూర్యప్రకాష్‌ను కలవగా ఆయన బృంద సభ్యులను అభినందించారు. వినియోగదారుల హక్కుల పై ప్రజలకు అవగాహన లేక పోవడంతో వాళ్ళు ఇబ్బందులు పడుతున్నారని, వారిని చైతన్యం చేసే దిశగా గ్రామీణ ప్రాంతాల్లోనూ అవగాహన తరగతులు నిర్వహించాలని సూచించారు. భవిష్యత్తులో తన వంతు సహకారాన్ని తప్పక ఈ బృందానికి అందిస్తానని డిఎస్ఓ తెలిపారు. డీఎస్ఓను కలిసిన వారిలో ఆశ్రా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు డాక్టర్ గంజి ఎజ్రా, ఉపాధ్యక్షుడు గేదెల ఇందిర ప్రసాద్, కార్యవర్గ సభ్యులు అడ్వకేట్ కె పి సారధి ఉన్నారు.

## వాలీబాల్ బాలుర జట్టుకు ముగ్గురు ఎంపిక



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 20 (వార్త):** గత నెల 8,9,10 తేదీలలో జరిగిన రాష్ట్ర అండర్ 19 స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా టీంకు వెన్నుదన్నుగా ఉన్న తురల్ల మోహన్ సాయి, మైలుపల్లి అప్పన్న, మైలుపల్లి లక్ష్మణరావులకు రాష్ట్ర జట్టులో స్థానం లభించింది. వీరు ఈ నెల 22వ తేదీ నుండి తెలంగాణ రాష్ట్రం నారాయణపేటలో జరుగు జాతీయ అండర్ 19 పోటీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రెటరీ బివి రమణ, కోచ్ కళ్లేపల్లి హరికృష్ణ, జిల్లా వాలీబాల్ సంఘం పెద్దలు హర్షం వ్యక్తం చేశారు.

## కాలేయం సమస్యపై నిర్లక్ష్యం వద్దు



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 20 (వార్త):** అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం డే అండ్ నైట్ జంక్షన్‌లో శుక్రవారం కాలేయం సమస్యతో బాధపడుతున్న వారికి ఉచితంగా వైబ్రో స్కానింగ్ నిర్వహించారు. ఈ మేరకు ప్రముఖ వైద్యులు ప్రశాంత్ కాలేయం సమస్యతో బాధపడుతున్న 60 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. ఈ హెపటైటిస్ లక్షణాలు కనిపించేటప్పుడు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చికిత్స చేయించుకోవాలని ఆయన సూచించారు. అక్షల సేవా సమితి అధ్యక్షులు బొడిగి మధు మాట్లాడుతూ జిల్లాలో డాక్టర్ ప్రశాంత్ సహకారంతో ప్రతి నెల ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్, మణికుమార్, జై కృష్ణ, క్లినిక్ స్పెషలిస్ట్ బెజ్జం వినయ్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## వైసీపీ జిల్లా ఐటీ విభాగం అధ్యక్షుడిగా అన్వేష్



**ఇచ్ఛాపురం, డిసెంబర్ 20(వార్త):** జిల్లా వైస్సార్సీపీ ఐటి విభాగం అధ్యక్షులుగా ప్రత్తి అన్వేష్ ను నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటి వరకు అన్వేష్ జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా పని చేశారు. అనుబంధ విభాగాలకు పలువురుని నియమించారు. తనకు పదవి లభించడం పట్ల పార్టీ అధ్యక్షులు వై ఎస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా అధ్యక్షులు కృష్ణదాస్ కి, ఎమ్మెల్సీ నర్తు రామారావుకి, జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పిరియా విజయకు, సాయిరాజ్‌కి అన్వేష్ ధన్యవాదాలు తెలిపారు.




## కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడుతో భేటీ

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 20 (వార్త):** కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును 20వ వార్డు రత్తకన్న తెలుగుదేశం పార్టీ ఇంచార్జి సుభాష్ రౌలో మర్యాద పూర్వకంగా భేటీ అయ్యారు. ఆయన దేశ రాజధాని న్యూ ఢిల్లీలో పార్లమెంట్‌లో కలిశారు. మున్సిపల్ సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు.

## నవోదయ పాఠశాల ఏర్పాటు చేయండి

### కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను కోరిన ఎమ్మెల్యే ఎంజీఆర్

**పాతపట్నం, డిసెంబర్ 20 (వార్త):** పాతపట్నం నియోజకవర్గంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో కలిసి కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఢిల్లీలోని పార్లమెంట్ సెంట్రల్ హాల్‌లో కలిసి విన్నవించారు. జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు.



# నిరుపేదలను ఆదుకొని భరోసా ఇవ్వండి

### ప్రముఖ వైద్య నిపుణురాలు పైడి సింధూర



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 20 (వార్త):** ఆపన్న హస్తం కోసం ఎదురుచూసే నిరుపేద అభాగ్యులను ఆదరించి వారికి భరోసాగా నిలవాలని ప్రముఖ వైద్య నిపుణురాలు, సింధూర హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పైడి సింధూర పిలుపునిచ్చారు. ఎచ్చెర్ల మండలం, తమ్మినాయుడుపేట గ్రామానికి చెందిన యతిరాజుల ఢిల్లేశ్వరరావు నరాలకు సంబంధించిన అంతుచిక్కని వ్యాధితో బాధపడుతున్నాడు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ ఏడాదిలోనే తన ఇద్దరు పిల్లలు, తండ్రిని కోల్పోయాడు. భార్య ఉన్నా అనుకోని పరిస్థితుల్లో తన కాలు విరిగిపోవడంతో ఇంటిలో పనిచేసేందుకు కూడా కష్టతరంగా మారింది. ఈ దీనపరిస్థితి ని తెలుసుకున్న కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ మీడియా కన్వీనర్, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ సభ్యులైన సీపాన రమేష్ కుమార్ ఆ కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. తాను ఆ కుటుంబానికి ఒక నెలకు సరిపడా నిత్యవసర సరుకులు ఏర్పాటు చేయగా తన మిత్రులు సహాయ సహకారాలతో నూతన వస్త్రాలతో పాటు మరో నెలకు సరిపడా 7వేలు రూపాయలు విలువ గల నిత్య వసర సరుకులను అందజేయడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం తమ్మినాయుడుపేట గ్రామంలో ఉన్న ఢిల్లేశ్వరరావు గృహాన్ని సందర్శించిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ పైడి సింధూర చేతుల మీదుగా నిత్యవసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆ కుటుంబ స్థితిగతులను, ఆరోగ్య పరిస్థితులను డాక్టర్ సింధూర అడిగి తెలుసుకున్నారు. ఢిల్లేశ్వరరావుకు సంబంధించి ప్రత్యేక వైద్యం కోసం తాను ప్రయత్నం చేస్తానని హామీని ఇచ్చారు. కళింగాంధ్ర యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు పైడి నవీన్ మాట్లాడుతూ డిల్లీశ్వరరావుకు ప్రభుత్వం తరపున పింఛన్ అందేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక గ్రామ పెద్దలు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## అమిత్ షాను భర్తరఫ్ చేయాలి

**వంగర.డిసెంబరు20 (వార్త):** భారత రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా ను తక్షణమే భర్త రఫ్ చేయాలని దళిత బహుజన జెఏసి ఉత్తరాంధ్ర అధ్యక్షుడు మజ్జి గణపతి, దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దళిత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎం.గణపతి రావు, దళిత ఐక్యవేదిక మండల అధ్యక్షులు చిత్తిరి గంగులు, సామాజిక న్యాయ పోరాట సమితి మండల అధ్యక్షుడు దర్రు రాంబాబు, బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు కారు రామారావు పలువురు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం వంగర మండల కేంద్రంలో మీడియాతో జేఏసీ నేతలు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సింబల్ ఆఫ్ నాలెడ్జిగా, ప్రపంచ మేధావిగా పేరు అందరూ కొనియాడుతుంటే అమిత్ షా మాత్రం పార్లమెంట్లో చులకనగా మాట్లాడడం చాలా విచారకరమన్నారు. బిజెపి కుల మతోన్మాదం నశించాలన్నారు. దళిత బహుజనుల పట్ల బీజేపీ కపట ప్రేమ చూపుతుందని విమర్శించారు. పార్లమెంట్ సాక్షిగా అమిత్ షా తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాలు మరింత ఉధృతం చేస్తామని బహుజన నేతలు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన నాయకులు సింహాచలం.రాజు,ఉదయ్, తిర్లంగి.సింహాచలం చిన్న రాంబాబు, బుజ్జి, సాయి. శ్రీరాములు, అప్పన్న పలువురు నాయకులు ఉన్నారు.



## యువకుడు అనుమానాస్పద మృతి



**పలాస, డిసెంబరు 20(వార్త):** కాశీబుగ్గ సమీపంలోని చిన్నబడాంలో చెట్టుకు ఉరివేసుకుని యువకుడు అనుమానాస్పద రీతిలో మృతి చెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. కాశీబుగ్గ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పోలీ సులు కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చిన్న బాడాంకు చెందిన అట్టాడ మురళి, అక్షయలు ప్రేమించుకున్నారు. అక్షయ తల్లిదండ్రులు వీరి వివాహానికి ఒప్పుకోకపోవడంతో వారు ఇంటి నుంచి పారిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఏడాది పాటు సాఫీగా సాగిన వీరి దాంపత్య జీవితంలో కొద్దిరోజుల కిందట కలతలు ఏర్పడ్డాయి. గర్భం దాల్చిన అక్షయ భర్తతో గొడవ పడి పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ నేపథ్యంలో ఆమె అబార్షన్ చేసుకున్నట్లు తెలుస్తోంది. విడాకులు కావాలని భర్తతో అక్షయ ఆమె తల్లిదండ్రులు ఇటీవల గొడవ పడ్డారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈనేపథ్యంలో భార్య తరుపు బంధువులే చంపేసి చిన్న బడాంలోని ఎగువ చెరువు గట్టుపై నున్న చెట్టుకు ఉరి వేసి ఉంటారని మృతుడి తండ్రి ఆరోపిస్తూ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు శవాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ చంద్రరావు వెల్లడించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## జిల్లా పంచాయతీరాజ్ రాజ్ విభాగం అధ్యక్షుడిగా నీలమప్పడు



**శ్రీకాకుళం టౌన్, డిసెంబర్ 20 (వార్త):** ఎచ్చెర్ల మండలం పొన్నాడ గ్రామానికి చెందిన నేతింటి నీలమప్పడు జిల్లా పంచాయితీ రాజ్ అధ్యక్షుడుగా ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్రె కిరణ్ కుమార్ నియమించారు. ఈయన గతంలో పంచాయతీ సర్పంచ్‌గా పని చేసి పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనడంతో పార్టీ ఈయన సేవలను గుర్తించి పదవి ఇచ్చింది. పార్టీ గుర్తించి పదవి ఇవ్వడం పట్ల నీలమప్పడు మాజీ ఎమ్మెల్యే కిరణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈయనకు పదవి లభించడం పట్ల పార్టీ కార్యకర్తలు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.



## సౌత్ జోన్ టోర్నీ విజేత ఐసీసీ

**ఇచ్ఛాపురం, డిసెంబర్ 20 (వార్త):** తెలంగాణ రాష్ట్రం హైదరాబాదులో అండర్ 14 ఫస్ట్ సౌత్ జోన్ టోర్నమెంట్లో విజేతగా ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఇచ్ఛాపురం క్రికెట్ క్లబ్ టీం విజేతగా నిలిచింది. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాదులో జరిగిన అండర్ 14 మొదటి సౌత్ జోన్ టి20 టోర్నమెంట్లో మొత్తంగా 12 టీములు పాల్గొనగా ఫైనల్ మ్యాచ్ ఇచ్ఛాపురం ఐసీసీ క్రికెట్ క్లబ్, తెలంగాణ ఎలైట్ క్రీకెట్ అకాడమీ మధ్య జరిగింది. మొదట బ్యాటింగ్ చేసిన ఐసీసీ టీం 20 ఓవర్లకు 159/6 రన్స్ చేసింది, తరువాత బ్యాటింగ్ దిగిన ఎలైట్ క్లబ్ 108 పరుగులు మాత్రమే చేయగలిగింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు జన్నెల హర్షవర్ధన్ కు వరించింది, ఫైనల్ మ్యాచ్లో హైయెస్ట్ స్కోరర్ గా పి శ్యాంసుందర్ 40 పరుగులతో నిలిచారు వీరందరికీ ఐసీసీ క్రికెట్ క్లబ్ తరఫున అభినందనలు తెలిపారు.

## జగన్ జన్మదిన వేడుకలు విజయవంతం చేయండి

**వజ్రపుకొత్తూరు, డిసెంబర్ 20 (వార్త):** రాష్ట్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి జన్మదిన వేడుకలు మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో ప్రగతి భవనంలో శనివారం నిర్వహించనున్నట్లు వజ్రపుకొత్తూరు ఎంపీపీ ఉప్పరపల్లి నీలవేణి ఉదయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్యకర్తలు అభిమానులు మహిళలు హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## టెక్కలి సర్పంచ్ రాజీనామా

**టెక్కలి, డిసెంబర్ 20 (వార్త):** టెక్కలి మేజర్ పంచాయతీ సర్పంచ్ గొండేల సూజాత తన సర్పంచ్ పదవికి రాజీనామా చేస్తూ ఆ పత్రాన్ని డీపీవోకు ఇచ్చినట్టు తెలిపారు. టెక్కలి పంచాయతీ సర్పంచ్‌గా 2021లో గెలిచినా తరువాత అందరి సహకారంతో అభివృద్ధి చేశానన్నారు.

## మత్స్యకారులు గుర్తింపు కార్డులు వినియోగించుకోవాలి



**వజ్రపుకొత్తూరు, డిసెంబర్ 20 (వార్త):** తీర ప్రాంతాల్లో ఉన్న ప్రతి మత్స్యకారుడు కూడా ఎన్ఎఫ్‌డిపి కార్డును వినియోగించుకోవాలని మత్స్యశాఖ ఫీల్డ్ ఆఫీసర్ కొండ నాగరాజు అన్నారు. వజ్రపుకొత్తూరు మండలంలో 75 శాతం ఈ రిజిస్ట్రేషన్ కార్డులు పూర్తి చేయడం జరిగిందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. చిన్న కొత్తూరు గ్రామంలో మత్స్యకారులందరూ కూడా శత శాతము గుర్తింపు కార్డులు పొందారన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా మత్స్యకారులు ఎవరూ కూడా చేపల వేటకు వెళ్ళవద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షులు గ్రామ పెద్దలు సాగర మిత్ర తదితరులు పాల్గొన్నారు.

## నర్సింహ సేవలు చిరస్మరణీయం


**పలాస, డిసెంబర్, 20 (వార్త):** గురుదాసుపురం గ్రామానికి చెందిన కుత్తుమ నర్సింహమూర్తి సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి గౌతు శ్యాం సుందర శివాజీ అన్నారు. శుక్రవారం నర్సింహమూర్తి వర్ధంతిని పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి 5కే రన్‌ను నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు, షీల్డ్‌నుమాజీ మంత్రి గౌతు  శ్యామసుందర శివాజి, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు పీరుకట్ల విఠల్ అందజేశారు. కార్యక్రమంలో తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షుడు కుత్తుమ లక్ష్మణరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.



## నాణ్యతకూ, నమ్మకానికీ చిరునామా సీఎంఆర్

* వస్త్ర వ్యాపారంలో రాజీ పడని సంస్థ సీఎంఆర్ * రూ.100 కోట్లతో అరసవల్లి దేవస్థానం అభివృద్ధికి చర్యలు * రాష్ట్ర పండుగగా రథసప్తమి వేడుకలు * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * విభిన్న, అధునాతన వస్త్ర, ఆభరణాలకు నిలయం సీఎంఆర్ * శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ * వస్త్ర ప్రపంచంలో రారాజు సీఎంఆర్ : సినీనటి శ్రీలీల

**శ్రీకాకుళం, డిసెంబర్ 20 (వార్త):** నాణ్యతకూ, నమ్మకానికీ చిరునామా సీఎం ఆర్ షాపింగ్ మాల్ అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని జీటీరోడ్డులో సీఎంఆర్ వస్త్ర, బంగారు ఆభరణాల షాపింగ్ మాల్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరికొత్త డిజైన్లతో మార్కెట్లోకి సీఎంఆర్ సంస్థ ఈ క్రిస్మస్, సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సిక్కోలు ప్రజలను పలకరించేందుకు వస్తోందన్నారు. జిల్లా ప్రజలంతా ఇకపై వస్త్రాల కొనుగోలుకు విభిన్న సంస్కృతులకు అద్దంపట్టే విధంగా ఆధునిక శైలికి, అభిరుచికి అనుగుణంగా నిలిచే అన్ని రకాల వెరైటీలు అందుబాటులో ఉంచామని తెలిపారు. వస్త్రాభరణాల కొనుగోలుకు ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా ఇక్కడే అవన్నీ లభ్యం కానున్నాయని అన్నారు. జిల్లా కేంద్రంలో పలువురికి ఉపాధి ఇస్తూ షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం ఆనందదాయకం అని అన్నారు. శ్రీకాకుళం నగరం అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని సుందర శ్రీకాకుళం నిర్మాణంలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యం కావాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా అరసవల్లి అభివృద్ధికి రూ. 100 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రణాళిక తయారు చేస్తున్నామని అన్నారు. టూరిజం అభివృద్ధి, అరసవల్లి దేవస్థానం రూ.100 కోట్ల తో అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో అధునాతన



హొటల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. టూరిజం అభివృద్ధి చేస్తే అభివృద్ధి చేసేందుకు అవకాశం అంటుందని, అందుకూ అవసరమైన ప్రతిపాదనలు తయారు చేస్తున్నామని తెలిపారు. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మహిళలకు ఆకట్టుకునే విధంగా వివిధ రకాల డిజైన్లతో చీరలు, చుడిదార్ వంటి వస్త్రాలు  అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరమన్నారు. ఇటువంటి పేరున్న సంస్థలు జిల్లాకు రావడం శుభ పరిణామం అని వస్త్ర వ్యాపార రంగంలో నూతన ఒరవడి సృష్టికర్తగా నిలిచిపోవాలని చెబుతూ శుభాకాంక్షలు అందించారు. ఇటువంటి దిగ్గజ కార్పొరేట్ సంస్థల రాకతో జిల్లా అభివృద్ధికి తోడ్పాటు అందుతుందని అన్నారు. అన్ని రకాల బ్రాండ్లు ఇక్కడే లభిస్తున్నా యని నిర్వాహకులు ఆయనకు తెలిపారు. రానున్న సంక్రాంతి, క్రిస్మస్ పండగల వేళ ప్రత్యేక ఆఫర్లు ఉన్నాయని నిర్వాహకులు ఆయనకు వివరించారు.

### తెలుగు ప్రజల ఆదరణ మరువలేను..

పుష్ప-2 విజయాన్ని అందించిన ప్రతీ ఒక్కరికి శ్రీలీల కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్ మరిన్ని మంచి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల మెప్పుపొందుతామని చెప్పారు. తెలుగు ప్రజల ఆదరణ ఎప్పటికీ మరువలేదని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, కింజరాపు హరివర ప్రసాద్, సీఎంఆర్ అదినేత రమణ, తదితరులు పాల్గొన్నారు.







## రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సిక్కోలు సత్తా



**శ్రీకాకుళం, డిసెంబర్ 20 (వార్త):** రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో సిక్కోలు క్రీడాకారులు సత్తా చాటారు. కాకినాడ జిల్లా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రెండు రోజుల పాటు జరిగిన 8వ రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు శుక్రవారం ముగిసింది. వివిధ జిల్లాల నుంచి 150మందికి పైగా బాక్సర్లు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంఫియన్‌షిప్ విశాఖ జిల్లా బాక్సర్లు కైవసం చేసుకోగా, రెండో స్థానంలో శ్రీకాకుళం జిల్లా నిలిచింది. వారు ఉత్తరప్రదేశ్‌లో జనవరి 6వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ జరిగే ఈ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల 50-55కిలోల విభాగంలో సీహెచ్.జన్నేశ్వరరావు(శ్రీకాకుళం) గోల్డ్, 55-60 కిలోల విభాగంలో పి.అపల్వరాజు(శ్రీకాకుళం) గోల్డ్, 60-65కిలోల విభాగంలో పి.విశేశ్వరరావు(శ్రీకాకుళం) సిల్వర్ మెడల్స్ సాధించారు. అలాగే 65-70కిలోల విభాగంలో లోకేష్(శ్రీకాకుళం)సిల్వర్, 70-75కిలోల విభాగంలో ఎస్.ఏసు(శ్రీకాకుళం) సిల్వర్, 75-80కిలోల విభాగంలో కె.శ్రీకాంత్(శ్రీకాకుళం) సిల్వర్, 85-90కిలోల విభాగంలో డి.మనోజ్‌కుమార్(శ్రీకాకుళం) సిల్వర్. 90కిలోలు అంతకంటే అధిక బరువు కలిగిన వారి విభాగంలో ఆర్.హేమంత్‌కుమాంర్(శ్రీకాకుళం) గోల్డ్‌మెడల్ సాధించారు.

Printed and published and Owner by Shaik Sahid,  printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Working Editor: Chowdari Pramod,  E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546